సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు






| సోమవారం 20 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 322 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




# లోక్ భవన్‌లో గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రతినిధి: లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేమ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. విద్యారంగానికి సంబంధించిన పలు అంశాలపై గవర్నర్ సీఎంతో చర్చించి, ముఖ్యంగా విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 12న ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంపై కూడా సీఎంతో చర్చించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే విద్యార్థుల నుంచి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణపత్రాలు తీసుకోవాలని సూచించగా, గవర్నర్ సూచనలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపడతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అక్షయ తృతీయ, పరశురామ జయంతి శుభాకాంక్షలతో పాటు రాజకీయ వ్యాఖ్యలు

## పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సభలకు భారీ స్పందన – మహిళా రిజర్వేషన్‌పై రాజకీయ ఆరోపణలు






సందేశం టైమ్స్, జాతీయ, ఏప్రిల్ 20, ప్రతినిధి: దేశవ్యాప్తంగా అక్షయ తృతీయ మరియు పరశురామ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ పర్వదినాలు సత్కార్యాలు, దానం, సేవా మార్గంలో ముందుకు సాగాలని ప్రేరణనిస్తాయని, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంపదలు, ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షలు వ్యక్తమయ్యాయి. పరశురాముని జీవితం అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే ధైర్యం, సత్య మార్గంలో నిలకడగా ఉండే సంకల్పాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశంపై రాజకీయ వ్యాఖ్యలు కూడా వెలువడగా, కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించాయని, దేశంలోని నారీశక్తి దీనిని మరవదని విమర్శలు వినిపించాయి. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ప్రజా సభల్లో భారీ జనసమ్మర్థం కనిపించగా, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి, సిండికేట్ రాజ్, చట్టసంరక్షణ లోపాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ప్రజలు పారదర్శక పాలన, అభివృద్ధి కోసం బీజేపీపై విశ్వాసం ఉంచుతున్నారని నాయకులు తెలిపారు. రోజు మొత్తం పలు ప్రాంతాల్లో నిర్వహించిన సభలకు యువత పెద్ద సంఖ్యలో హాజరై పార్టీకి మద్దతు తెలపడం విశేషంగా నిలిచింది.



# సాహో చంద్రబాబు.. గుంటూరులో అంబరాన్నంటిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, గుంటూరు, ఏప్రిల్ 20, ప్రతినిధి: నవ్యాంధ్ర శిల్పి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు గుంటూరు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించబడాయి. మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మరియు వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ముఖ్యమంత్రి 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 76 కేజీల భారీ కేక్‌ను సిద్ధం చేసి, అభిమానుల జయజయధ్వానాల మధ్య నక్కా ఆనందబాబు కట్ చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు స్వయంగా తినిపించారు. “సాహో చంద్రబాబు” నినాదాలతో కార్యక్రమం మారుమోగగా ప్రజాగాయకుడు రమణ ప్రత్యేక గీతాలాపనతో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అభివృద్ధికి ప్రతీకగా నిలిచారని, హైటెక్ సిటీ నుంచి అమరావతి వరకు ఆయన తీసుకున్న ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తు కోసం అన్నీ కృషి చేశారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో నడిపిస్తూ ఎన్నో రికార్డులు సృష్టించారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శమని, రాష్ట్రాన్ని మళ్లీ అగ్రస్థానంలో నిలబెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్, బోరుగడ్డ వెంకట్రావు, విజయ్ కిరణ్, సొపాటి రత్నం, సింధు, తెనాలి శ్యామ్, తప్పెట్ల ప్రదీప్, తెనాలి రవి, ఉప్పలపాటి మునియ్య, బండ్లమూడి వీరేంద్ర తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# నిడదవోలులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహణ

సందేశం టైమ్స్, తూర్పుగోదావరి, ఏప్రిల్ 20, ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ‘స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమం భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్రను ఉద్యమంలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల ‘జలధార-జలహారతి’ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించి స్వచ్ఛ రథాలను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమం సందర్భంగా స్వచ్ఛాంధ్ర స్టాళ్లను సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాలకోడు చెరువు పునరుద్ధరణ, కంపోస్టింగ్ విధానాలపై నిపుణులు మరియు మహిళలతో చర్చలు జరిపి చెత్త నుంచి సంపద సృష్టిస్తూ స్వయం సహాయక సంఘాలు ఆదాయం పొందడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్థానికుల సమస్యలు, వారి కష్టసుఖాలను తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

# తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్-డీఎంకే కూటమి గెలుపే లక్ష్యం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



సందేశం టైమ్స్, జాతీయ, ఏప్రిల్ 20, ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమై పార్టీ వ్యూహాలపై చర్చించారు. తమిళనాడులో కాంగ్రెస్–డీఎంకే కూటమి గెలుపే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని శివగంగ సహా పలు జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజానాయకుడిగా, జాతీయ స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల వ్యూహకర్తగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. గాంధీ కుటుంబంతో ఆయనకు ఉన్న అనుబంధం రాజకీయంగా మరింత బలాన్ని ఇస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# కార్మిక హక్కుల కోసం సమ్మె హెచ్చరికలు.. కుల గణనపై మల్లన్న పోరాటానికి ప్రశంసలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రతినిధి: కార్మికుల హక్కుల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే సమ్మె మార్గంలోకి వెళ్లడం తప్పదని, చర్చలకు వస్తే గౌరవం ఉంటుందని, లేకపోతే పోరాటమే సమాధానమని పేర్కొన్నారు. కార్మికుల కన్నీళ్లు తుడిచే వరకు వెనుకడుగు వేయబోమని, అవసరమైతే బస్సులు రోడ్లపై తిరగనివ్వకుండా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఇదే సమయంలో కుల గణన వివరాలను బహిర్గతం చేయాలన్న తన నిరంతర పోరాటం ఫలించిందని, ప్రభుత్వం ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం తమ విజయమని టీఆర్పీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు మల్లన్నను ఘనంగా సన్మానిస్తూ ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ప్రభుత్వం మొండికేస్తే తమ ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని, ఈ నెల 22న చరిత్రాత్మక సమ్మె నిర్వహించనున్నట్లు మల్లన్న స్పష్టం చేశారు.



## వట్‌పల్లి మండలంలో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

సందేశం టైమ్స్, వట్‌పల్లి, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరొక కీలక అడుగు పడింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఆశీస్సులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణంతో రవాణా సౌలభ్యం మెరుగుపడటంతో పాటు గ్రామ అభివృద్ధికి కొత్త దిశలో ముందడుగు పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనరసింహ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాప్ట(కె)లో బసవేశ్వర విగ్రహావిష్కరణ ఘనంగా



సందేశం టైమ్స్, కంగ్టి, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం చాప్ట(కె) గ్రామంలో బసవేశ్వర జయంతి సందర్భంగా నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, న్యాయం, ధర్మం కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు బసవేశ్వర స్వామి అని పేర్కొని, ఆయన బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ముఖ్యంగా యువత ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బసప్ప, మాజీ సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ మోహన్‌తో పాటు నాయకులు సంగప్ప, సంతోష్, నర్సింలు, పరశురాం, రమేష్, పరమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై బసవేశ్వర స్వామికి ఘన నివాళులు అర్పించగా కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా ముగిసింది.



## వాయిలసింగవరం గ్రామంలో చలివేంద్రము ప్రారంభం

సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 20, ప్రతినిధి: అనంతగిరి మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో గ్రామపంచాయితీ కార్యాలయం సమీపంలో కీర్తిశేషులు చుండూరు అచ్చయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రమును గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు త్రాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కీర్తిశేషులు చుండూరు అచ్చయ్య కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ గ్రామ అభివృద్ధి కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు చుండూరు అచ్చయ్య కుటుంబ సభ్యులు చుండూరు భారతమ్మ, చుండూరు మురళి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గద్దె రఘు, కొల్లు సుబ్బారావు, దాములూరి మురళి, గద్దె రామారావు, జొన్నలగడ్డ సైదులు, మేళ్ళచెర్వు జకరయ్య, గూడపూరి కోటయ్య, బుర్రా నాగమల్లేశ్వరరావు, బుర్రా రాజబాబు, అల్లూ నాగేశ్వరరావు, గద్దె మురళి, బుర్రా సైదులు, వంశీ, చుండూరి నరేష్ తదితరులు మరియు గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ పిలుపుతో ఉద్యమకారుల ఫోరం సమావేశం




సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 20, ప్రతినిధి: ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో "చలో హైదరాబాద్" పిలుపుతో ఈనెల 18న తార్నాకలోని మర్రి కృష్ణ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ పాలకుర్తి కృష్ణ అధ్యక్షత వహించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గానికి చెందిన టీయూఎఫ్ కన్వీనర్ ఎదురుగట్ల చిట్టిమల్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేషధారణలో నిరసన వ్యక్తం చేస్తూ పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నారాయణఖేడ్‌లో బ్రహ్మకుమారీస్ బాబా సెంటర్‌కు శంకుస్థాపన



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని పంచగామ కమాన్ సమీపంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్మించనున్న 'బాబా సెంటర్' భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని, అది ఆధ్యాత్మికత ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. నిస్వార్థ సేవ, క్రమశిక్షణకు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతీకగా నిలుస్తోందని ప్రశంసించి, నారాయణఖేడ్ పట్టణంలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పడటం వల్ల ప్రజల్లో ధ్యానం, యోగా పట్ల అవగాహన పెరిగి మెరుగైన జీవన విధానం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాబా సెంటర్ నిర్మాణానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.

## జోగిపేటలో తృటిలో తప్పిన పెను ప్రమాదం



సందేశం టైమ్స్, అందోల్-జోగిపేట, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట పట్టణంలో ఆకస్మిక వాతావరణ మార్పులతో చోటుచేసుకున్న ఘటనలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఇటీవల తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి ముందు నివసిస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ వర్షం నుంచి తప్పించుకునేందుకు మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న షెడ్డులోకి వెళ్లే ప్రయత్నం చేయగా భారీ చెట్టు ఒక్కసారిగా విరిగి షెడ్‌పై కూలింది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా అక్కడి నుంచి తప్పించుకోవడంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురైనా చివరికి ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## నర్సాపూర్‌లో ఘనంగా హిందు సమ్మేళనం నిర్వహణ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 20, ప్రతినిధి: నర్సాపూర్‌లో ఈరోజు ఘనంగా నిర్వహించిన హిందు సమ్మేళనంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, స్థానిక నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేశభక్తి నినాదాల మధ్య నిర్వహించిన ఈ సమ్మేళనం ఆధ్యాత్మిక ఉత్సాహంతో సాగింది.

## దివ్యాంగులకు చట్టసభల్లో 5% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఎన్‌పీఆర్‌డీ ఇండియా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య దేశంలో త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దివ్యాంగులకు చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగులు కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా రాజకీయ నిర్ణయాధికారంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త నియోజకవర్గాల ఏర్పాటులో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించాలని, శారీరక దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో మొదటి రోస్టర్ పాయింట్ కేటాయించాలని కోరారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ. 15,000, సాధారణ దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్ తక్షణమే ఇవ్వాలని, అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో విద్యుత్ తీగల నుంచి మంటలు




సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 20, టౌన్ రిపోర్టర్ వి. సాయి: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు ఒకదానిపై ఒకటి తగలడంతో మంటలు చెలరేగాయి. ఘటనను గమనించిన స్థానిక గ్రామస్తులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా, ప్రమాదం మరింత విస్తరించకుండా విద్యుత్ సరఫరాను తక్షణమే నిలిపివేశారు. అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



## జిల్లాలో 7 రోజుల సంక్షేమ వారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 20, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీవోలు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్‌సీఓలతో కలిసి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వారాన్ని పటిష్ఠ కార్యాచరణతో నిర్వహించాలని, రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్యం, వంటగది నిర్వహణ, మరమ్మత్తు పనులు చేపట్టాలని, విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, పెయింటింగ్ వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవోలు, సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఆర్‌సీఓలు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా కౌడ శ్రీనివాస్ గుప్తా ఎన్నిక

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 20, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్: ఆర్యవైశ్య సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కౌడ శ్రీనివాస్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూప్రాన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకోగా, కౌడిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకుడు కౌడ శ్రీనివాస్ గుప్తను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే కౌడిపల్లి గ్రామానికి చెందిన ఉడుత మురళి బాలరాజు మూట్రాజ్‌పల్లి సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు కౌడ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కౌడిపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉడుత వెంకటేశం గుప్తా, ఉడుత రాజు గుప్తా, నాడ్ల వెంకటేశం గుప్తా, సిద్ధిరాములు గుప్తా, బాలకిషన్ గుప్తా, నర్సింలు గుప్తా, రవీందర్ గుప్తా, శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు

## కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రతినిధి: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన జన్మదినం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన వారితో కొంతసేపు ఆత్మీయంగా చర్చలు జరిపి వారి మార్గదర్శకత్వం తనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కేసీఆర్, కేటీఆర్ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని తెలియజేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ తనయుడు నయన్ రాజ్ కూడా పాల్గొని పెద్దల ఆశీస్సులు పొందగా, ఈ సమావేశం సాన్నిహిత్య వాతావరణంలో సాగింది.



## పటాన్చెరులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 20, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో మురళీకృష్ణ బెండపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఆయన నిర్వాహకులను అభినందిస్తూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీత కృష్ణం రాజు, కృష్ణం రాజు, శ్రీధర్ చారి, నర్రా బిక్షపతి మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## ఉచిత చికిత్సతో ప్రజలకు ఉపశమనం పర్స శ్యామ్ రావు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 20, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్కంద హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎం.జె.ఎం.ఎస్.ఎస్ అధ్యక్షులు పర్స శ్యామ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి ఆయన స్వయంగా పరీక్షలు చేయించుకుని వైద్యుల సేవలను అభినందించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. జి.సి. ప్రసన్న కుమార్, డా. శరత్ సాయి (ఆర్థోపెడిషియన్), డా. మనోజ్ఞ (జనరల్ ఫిజీషియన్), డా. శ్రీనాథ్ వాసగిరి (న్యూరో ఫిజీషియన్), డా. రవిశంకర్ పాల్గొని రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ అవకాశాన్ని సమీప కాలనీల వాసులు, గ్రామ ప్రజలు, కొల్లూర్ డబుల్ బెడ్‌రూమ్ నివాసులు సద్వినియోగం చేసుకోవాలని పర్స శ్యామ్ రావు కోరుతూ ఇలాంటి శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.




## బోరంచ నల్లపోచమ్మ జాతరకు సిద్ధం – ఏప్రిల్ 23 నుంచి 7 వారాల మహోత్సవం ప్రారంభం

సందేశం టైమ్స్, మనూర్ మండలం, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలోని మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి జాతర ఈ నెల 23వ తేదీ గురువారం నుంచి ప్రారంభమయ్యే 7 వారాల మహా జాతర కోసం విస్తృత ఏర్పాట్లు పూర్తి దశకు చేరుకున్నాయి. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సమగ్ర ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తుల రాకపోకలకు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. జాతర కాలంలో సేవా కార్యక్రమాలు, ధార్మిక ఉత్సవాలు విస్తృతంగా నిర్వహించబడనున్నాయని పేర్కొన్నారు.



## మెదక్ ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్ నియామకం

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 20, మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్: మెదక్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా 2022 బ్యాచ్‌కు చెందిన విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ నియమితులయ్యారు. ప్రస్తుతం భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను మెదక్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన మహేందర్ గత నెల 31న పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో విక్రాంత్ కుమార్ సింగ్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

## నర్సాపూర్‌లో యువతకు క్రికెట్ గ్రౌండ్, కిట్ అందజేత





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 20, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ 1వ వార్డు జగన్నాథరావు కాలనీలో నిరుపయోగంగా ఉన్న ప్రైవేట్ స్థలాన్ని స్థానికుల సహకారంతో చదును చేసి క్రికెట్ గ్రౌండ్‌గా అభివృద్ధి చేసి యువతకు అందుబాటులోకి తీసుకువచ్చారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్‌ను కూడా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమతి మినికే నర్సమ్మ మాట్లాడుతూ ప్రతి యువకుడు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచిస్తూ, ప్రస్తుత వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉదయం మరియు సాయంత్రం సమయాల్లో మాత్రమే క్రీడల్లో పాల్గొనడం మంచిదని తెలిపారు. యువతకు క్రికెట్ ఆడేందుకు ప్రైవేట్ స్థలాన్ని వినియోగించుకునేలా అనుమతించిన కటికే మల్లారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మినికే రవికుమార్, విజయ్ కుమార్, ఆజాం అలీ, వేణు రాజు తదితరులు మరియు కాలనీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సహాయం అందించిన రాచమల్ల అనిల్ గౌడ్

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీలో గత పది సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ కార్యకర్త వడ్డే సాయికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాచమల్ల అనిల్ గౌడ్ తన వంతు సహాయంగా కుటుంబాన్ని పోషించుకునేందుకు ప్యాసింజర్ ఆటో కొనుగోలు కోసం రూ.1 లక్ష డౌన్ పేమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా రాచమల్ల అనిల్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల రవి ప్రసాద్ గౌడ్, అస్గర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళా బిల్లుపై బీజేపీ ప్రచారం తప్పుదారి పట్టింపు: నిర్మల జగ్గారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో మద్దతుదారుడేనని స్పష్టం చేస్తూ, బీజేపీ చేస్తున్న వ్యతిరేక ప్రచారం పూర్తిగా తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఖండించారు. గతంలో మహిళా బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చి ఆమోదం దిశగా ముందుకు తీసుకెళ్లిందని గుర్తుచేసిన ఆమె, ప్రస్తుతం బీజేపీ డీలిమిటేషన్‌తో కలిపి బిల్లును ప్రవేశపెట్టడం వెనుక రాజకీయ ఉద్దేశాలు దాగి ఉన్నాయని విమర్శించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును వేరుగా ప్రవేశపెడితే కాంగ్రెస్ తప్పకుండా మద్దతు ఇస్తుందని పేర్కొంటూ, బీజేపీలో మహిళలకు తగిన ప్రాధాన్యం లేదని, కాంగ్రెస్ మాత్రం ఇందిరా గాంధీని ప్రధాని చేసిన ఘనత కలిగిందని తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. రాబోయే సమావేశాల్లో మహిళా బిల్లును ప్రత్యేకంగా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, లేదంటే మహిళల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.



## నారాయణఖేడ్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహణ

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఉన్న శ్రీ దత్తాత్రేయ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రతి సోమవారం ఉదయం ప్రధాన అర్చకులు శ్రీ దత్తాత్రేయ స్వామికి క్షీరాభిషేకం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందుతున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజూ భగవద్గీత పారాయణం జరుగుతోందని, ప్రస్తుతం 20వ సారి పారాయణం కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం కాలభైరవ అష్టకం పారాయణం నిర్వహించబడుతుండగా శివుని ఉగ్రరూపమైన కాలభైరవుడిని స్మరించడం ద్వారా అజ్ఞానం, భయం, దుఃఖం తొలగి శక్తి లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. అలాగే ప్రతి మంగళవారం, శనివారం సాయంత్రం 7 గంటలకు హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించబడుతూ భక్తులకు భక్తి, ధైర్యం పెరగడంతో పాటు అనారోగ్యం, శత్రువులు, కష్టాల నుంచి దైవిక రక్షణ లభిస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాశెట్టి శివలింగ పాటిల్‌తో పాటు సభ్యులు ముత్యపు హనుమాన్లు, మహాశెట్టి కాశీనాథ్ పాటిల్, ముత్యాల మహేష్ కుమార్, పెండ్కర్ దీపక్, దారం కృష్ణమూర్తి, దత్తు సౌకారి, కిషన్ రావు, వెంకట్ రావు, బాబురావు, లక్ష్మయ్య, అశోక్, కృష్ణ సెట్, వడ్ల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## అమెరికాలో కాల్పులు.. 8 మంది పిల్లలు మృతి

సందేశం టైమ్స్, అంతర్జాతీయ, ఏప్రిల్ 20, ప్రతినిధి: అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో రద్దీ ప్రదేశంలో జరిగిన కాల్పుల ఘటనలో ఎనిమిది మంది చిన్నారులు దుర్మరణం చెందడం కలకలం రేపింది. మృతుల వయసులు ఒకటి నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాయుధుడు ఆకస్మికంగా కాల్పులకు దిగడంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఘటన అనంతరం పారిపోతున్న నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులు జరపగా అతడు కూడా మృతి చెందినట్లు వెల్లడించారు. కాల్పులకు గురైన చిన్నారుల్లో కొందరు నిందితుడి బంధువులే ఉన్నట్లు సమాచారం వెలువడింది. ఈ ఘటనపై స్థానిక అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.